# అద్భుత దీపాలు

అల్లూరి గౌరీలక్ష్మి

సాహిత్య సంపుటాలు కొన్ని మనుషుల్లాగే మనతో మమేకమవుతాయి
చిరకాలం మన అల్మైరాలో ఆత్మీయంగా ఉండిపోతాయి
ఎప్పటికీ విడదీయరాని నేస్తాలై అల్లుకుపోతాయి
కొన్ని కవితలు పరిచయం కాగానే వికటిస్తాయి
మరికొన్ని కథలు  మన చెయ్యి పట్టుకుని, కూడా వచ్చేస్తాయి
కొన్ని నవలలు సగం తర్వాత నచ్చకుండా పోతాయి

జీవం ఉన్న పుస్తకాలూ, ప్రాణం ఉన్న మనుషులూ ఒకటే !
నెయ్యం కలిస్తేనే చేతులు కలుపుకుని కడ దాకా నడవ గలిగేది





ఆ సాహిత్యంలోని అక్షరాలు మోసే ఊహాలోచనల్లో
మన అంతరాంతరాల సహానుభూతేదో కలిసిపోవాలి
అప్పుడా కథా పాత్రలు మన బంధువులవుతారు
వారి కష్ట సుఖాల్లో మన అనుభవాలుంటాయి
ఆ సన్నివేశాల్లో మన అనుభూతులుంటాయి
ఆ రస ప్రవాహంలో మనం సదా ఈత కొడుతుంటాం!

చుట్టూ వందల కొద్దీ మనుషులు, వేలకొద్దీ పుస్తకాలు
ఇన్నాళ్లు కలవని మరో గొప్ప మిత్రుని కోసం వెతికినట్టు
ఇంకో అపురూపమైన పుస్తకం కోసం ఎదురు చూస్తూనే ఉంటాను
పుస్తకాలైనా నేస్తాలైనా, జీవితాల్ని వెలిగించే అద్భుత దీపాలే!

★★★

# సాగర సంగమం

సిరిపురం శ్రీనివాస శర్మ

నదీనామ్ సాగరో గతిః
అన్నది శాస్త్ర వాక్యం ,
ఏ కొండల్లో కొనల్లో పుట్టిందో,
ఎన్ని బండ రాళ్లు
తల బద్దలు కొట్టాయొ ,
ఎన్ని ఇరుకు సందుల్లో చిక్కువడి
నలిగి పోయిందో,
ఎన్ని చెట్ల రాపిడిలో
వళ్లు చెక్కుకు పోయిందో,
ఎన్ని అహంకారాలు
తన త్రోవకు అడ్డు తగిలాయొ ,
ఏది ఏమైన -
అడ్డు వచ్చిన వారికి అడ్డు చెప్పక
తల వంచి తన త్రోవ మార్చుకుని
గడ్డి పూల హారాలు
మెడను వేసుకుంటూ ,
చెట్ల దుంగలు
చేతికి వృతం అవుతుంటె ,
తలపగిలిన నెత్తురు
శిలాజాలకూ రంగు పూస్తుంటే
వెంట వచ్చిన స్నేహం
మధ్యలోనే జారిపొతుంటే ,
గమ్యమే తప్ప మరొకటి
యెరుగని తాను
పరుల సేవ కోసం పరుగులు పెడుతూ
తన వునికి మరచి
మట్టిలో మట్టి అయి,
పొలాల దాహార్తి తీర్చి ,
నాగలి పట్టిన రైతన్న
కలలు పండించి,
దాహమన్నవాడి గొంతు తడిపి
వేల మైళ్ళు
అలుపూ సొలుపూ ఎరుగక
ఎండ వాన చూడక
పరుగులు పెట్టి
వురకలు వేసి
తన గతి పతి అయిన
సాగరుని కౌగిలి లో
వొదిగి పోవాలని కలిగి పోవాలని
నదీమ తల్లి చేరింది సాగరతీరం
జరగనుంది సాగరసంగమం. ...
అలల బాహువులు చాచి
సాగరుడు పిలుస్తుంటే
గిరులు తరులు విడచి
వనాలు పొలాలు గడచి
మానావమానాలు మరచి
సకల జనుల సౌభ్రాతృత్వమే
మది నెంచి
శరీర గాయాలకు
త్యాగాల మందు పూసుకుంటు
తన నిశ్శబ్ధ నిరీహం నుంచి
సాగరఘోష లో మమేక మవ్వాలని
వువ్విళ్ళూరుతూ వురకలు వేస్తూ
తనను నిశ్శబ్దంగా చేరిన
నదీమ తల్లిని
అలల బాహువుల బంధించి
ఆమె అణువణువునూ
తనలో విలీనం చేసుకుంటూ
నది సాగరంగా, సాగరం నదిగా
మారుతున్న తరుణం
ఈ సాగర సంగమం ..... ★★★

## ఆర్ద్రత
### అనంతలక్ష్మి

ఉరుకుల పరుగుల జీవితం
యాంత్రికత్వంతో సాహచర్యం
మమత ఏనాడో జీవిత ఖైదు అయింది,
మొరటు ధనాల జైలు గోడల్లో
మనసు రాటు దేలింది,
వాడకం లేని ఆలోచనలు తుప్పుపట్టి
మొద్దుబారి పోయి దశాబ్దాలు గడిచాయి,
పువ్వుని నవ్వుని చూసి
స్పందించని హృదయ నాళాలు
గుండెగదులతో అంతర్యుద్ధం చేసి
ఓటమి పాలౌతున్నాయి,
ప్రాపంచిక సుఖాలు పూడ్చలేని వెలితిని
కప్పలేక మనసు ఆయాస పడుతోంది,
ఆత్మీయత అలవాటు తప్పి శతాబ్దమయింది,
మనసైన పలకరింపులు వాడుక మరచి
కృత్రిమ నవ్వుల పూలు పూస్తున్నాయి,
అతి సహజంగా మరింత పేలవంగా
మొలకెత్తని విత్తనాలు నాటితే
భూమి బంగరు నవ్వుల పంటల
పండించదు!
హృదయాల లోతుల్ని తడిమే
ఆర్తి బతకాలి !
ఆ గుండెలోని ఆర్ద్రత
ప్రతి గుండెని తాకాలి.!!

★★★

## పిల్లల మొగ్గలు
### డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

పిల్లలు పరిమళాలను వెదజల్లే మొగ్గలవుతూనే
పువ్వుల్లా వికసించే మకరందాలవుతుంటారు
పిల్లలు ఎప్పటికీ తడి ఆరని గంధపుచెక్కలు

పిల్లలు మురిపించే ముసినవ్వులను చిందిస్తూనే
సెలయేటి గలగలలను మరిపించే చప్పుళ్ళవుతారు
పిల్లల పలుకులు మెరిసే ముత్యాల ముంగిళ్ళు

పిల్లలు వసివాడని పసిడివన్నెల బుగ్గలవుతూనే
చిగురించే లేలేతకొమ్మల మొగ్గలవుతుంటారు
పిల్లలు ఎప్పటికీ వికసించే వెన్నెల కిరణాలు

పిల్లలు ముద్దుముద్దు పలుకులను పలుకుతూనే
చిలుకపలుకులను చిందించే చిరునవ్వులవుతారు
పిల్లల పలుకులు బ్రహ్మ పలికే మధురవాక్కులు

పిల్లలు కల్మషమెరుగని కరుణామయులవుతూనే
కల్లాకపటాన్ని దరిచేరని బాలబ్రహ్మలవుతారు
పిల్లలు మంచిదనపు మరుమల్లె సుమగంధం

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏల భయమిట్లు నన్నావహించుచుండె?
ఏల మనసెల్ల చింతతో క్రాలుచుండె?
భయము వలదేమొ, తెలియని భ్రమ యిదేమొ
కంటికానని వింత రుగ్మత యిదేమొ!

అంతు తెలియని చింత వెన్నాడుచుండు
శాంతి కనరాదు మదిలోన సుంత యైన
అనవరతమెవరొ నను వెన్నాడుచుండ్రు
వెనుదిరిగి చూడనెవ్వరి కనగలేను

నాదు నీడయె కలిగించు నాకు భయము
నా మనసె వెక్కిరించును నన్ను నేడు
పారిపోవుదమన్న నా వలను కాదు
నిలచి యుండుట కూడ నా వలను కాదు

ఎవ్వరో వచ్చి నన్ను రక్షించు వరకు
బంధితుడనౌదునిట్టులీ పంజరమున
చింత యన్నది మానసస్థితి యటంచు
వెడలగలవంచు నా తోడ నుడువునెవరు?

ఎవ్వరును రారు వెలిగింప దివ్వెనొకటి
కన్నులను విప్పి మనమె చీకటిని తరుమ
జ్ఞానతేజస్సు మదిలోన జననమందు
భీతి వెడలును ధైర్యము విడిది చేయు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS